పొన్నూరు వీధుల్లో చీకట్లు

- అస్తవ్యస్తంగా వీధిలైట్ల నిర్వహణ
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- అవస్థలు పడుతున్న పొన్నూరు పట్టణ ప్రజలు

పొన్నూరు: పురపాలక సంఘ పరిధిలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. కొన్ని నెలలుగా దీపాల వెలగకున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. ప్రధాన రహదారులు, కూడళ్లలో రాత్రుళ్లు చీకట్లు అలుముకుంటున్నాయి. ఇక శివారు కాలనీల పరిస్థితి మరీ దయనీయం. గుంతల రోడ్లు.. ఇళ్ల చుట్టూ ఏపుగా పెరిగిన కంపచెట్లతో విష పురుగుల సంచారం.. దొంగల భయంతో రాత్రుళ్లు ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. అంధకారంలో ఇళ్లలోంచి బయట అడుగు పెట్టాలంటేనే భయపడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు.

మరమ్మతులు మరిచారు..

నిడుబ్రోలు టిడ్కో గృహాలకు వెళ్లే దారిలోని ఎరుకలవాడ వీధిలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. ఈ ప్రాంతాల్లో రహదారులు గుంతలమయంగా ఉండటంతో రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, తహసీల్దార్ కార్యాలయం, ఇటికంపాడు రోడ్డు, కసుక్రరు రోడ్డులో కొంత కాలం నుంచి పూర్తి స్థాయిలో వీధి లైట్లు వెలగడం లేదు. నిడుబ్రోలు వంతెన, బాపట్ల రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఉన్న వీధి దీపాల్లో కొన్ని వెలగడం లేదు.


బాపట్ల రోడ్డులో వెలగని లైట్లు

మున్సిపాలిటీ పరిధి వార్డులు	31
సచివాలయాలు	17
జనాభా	65 వేలు
వీధిలైట్లు సుమారు	7 వేలు
వెలగని లైట్లు సుమారు	2 వేలు

మరికొన్ని ఒకవైపు మాత్రమే వెలుగుతున్నాయి. దీంతో గుంతలు కన్పించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దారిలో రాత్రిళ్లు పశువులు రహదారిపైనే పడుకుంటాయి. చీకట్లో వాటిని గమనించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.


ఐలాండ్ సెంటర్‌లో వెలగని స్ట్రీట్ లైటు


నిడుబ్రోలు వంతెన మెడికల్ షాపు వద్ద వెలగని లైటు

నిధులు కేటాయించినా..

మున్సిపల్ బడ్జెట్‌లో ప్రతి ఏడాది వీధుల దీపాల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయింపు ఉంటాయి. పట్టణంలో వీధి దీపాలు, పారిశుద్ధ్యం నిర్వహణకు అధిక మొత్తం నిధులు ఖర్చు చేస్తుంటారు. అయినా మరమ్మతుల చేయించడంలో అలసత్వం కారణంగా మళ్లీ మళ్లీ సమస్య తలెత్తుంది. ఇంజినీరింగ్ విభాగం సరైన తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

సమస్యను త్వరలో పరిష్కరిస్తాం



పట్టణంలో వీధిలైట్ల సమస్యను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపడతాం. ఇటీవలే కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించాను. పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న కొన్ని సమస్యలను గుర్తించాం. వాటన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తాం. వీధి లైట్లకు 15 రోజుల్లోగా వెలుగులు వచ్చేలా చేస్తాం.

–ముప్పాళ్ల రమేష్‌బాబు,
మున్సిపల్ కమిషనర్, పొన్నూరు.

క్లుప్తంగా

బాణసంచా దుకాణాల్లో నిబంధనలు తప్పనిసరి



పొన్నూరు: దీపావళి పురస్కరించుకుని పట్టణంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటులో నిర్వాహకులు తగిన నిబంధనలు తప్పక పాటించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. మంగళవారం దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం టపాసుల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఫైన్ ఆర్ట్స్‌లో డాక్టరేట్



గుంటూరు ఎడ్యుకేషన్: చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆర్ట్, క్రాఫ్ట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కేవీ సాంబశివరావు అమెరికాలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి ఫైన్ ఆర్ట్స్‌లో డాక్టరేట్ పొందారు. ఈసందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం, ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్ఎం ఖాసిం మాట్లాడుతూ సాంబశివరావు డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగానే కాకుండా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశాలకు అవసరమైన చిత్రాలు గీస్తారని తెలిపారు. చిత్రలేఖనంలో సినీ దర్శకుడు బాపు వంటి గొప్ప వారు అందుకున్న డాక్టరేట్‌ను తమ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు అందుకోవడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఆయన సేవలను, నైపుణ్యాన్ని గుర్తించి డాక్టరేట్‌తో సత్కరించిందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఐఏఎస్ శంకరన్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: విశ్రాంత ఐఏఎస్ ఎస్.ఆర్.శంకరన్ సేవలు మరువలేనివని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్లేషకులు ఎన్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం విశ్రాంత ఐఏఎస్ ఆర్.శంకరన్ జయంతి సందర్భంగా తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శంకరన్ తాను జీవించి ఉన్నంత కాలం అట్టడుగు వర్గాల దళితుల అభివృద్ధి కోసం నిర్విరామంగా కృషి చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇళ్ల స్థలాలు భూములు కేటాయింపునకు శంరన్ చేసిన కృషి ఎనలేనిదని చెప్పారు. అంటరాని తనం రూపుమాపటానికి వారి ప్రాథమిక హక్కులు అందుబాటులోకి తీసుకురావటానికి మరిచి పోలేని కృషి చేశారన్నారు. ఉపాధ్యాయ నాయకులు ఎస్.వి.సత్యనారాయణ, విశ్లేషకులు వి.వి.రావ్ నివాళులర్పించారు.

ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలంటూ వినతి

గుంటూరు మెడికల్: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ మంగళవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్‌ను కలసి పలువురు ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. ఇటీవల కాలంలో మణిపూర్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగులను రెగ్యులర్ చేసిందని, అదే తరహాలో ఏపీలో పనిచేస్తున్న వారిని కూడా రెగ్యులర్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చొరవ చూపించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీ రాష్ట్ర హెచ్ఐవీ ల్యాబ్ టెక్నీషియన్స్ అండ్ ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ షేక్ ముస్తఫా, జిల్లా జనరల్ సెక్రటరీ అహ్మద్ ఆలి, జిల్లా జాయింట్ సెక్రటరీ పిల్లిమేరీ కుమారి పాల్గొన్నారు.

రైల్లో నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుండి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి పెదవడ్లపూడి స్టేషన్ల మధ్య మోరంపూడి రైల్వే గేటు సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని మంగళవారం పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. రైల్లో నుండి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి జేబులో గౌహతి నుండి కోయంబత్తూర్‌కు తీసుకున్న టికెట్ ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



పొన్నూరు: మండలంలోని భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని మండల తహసీల్దార్ జియా ఉల్ హక్ తెలిపారు. గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని దండమూడి గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టుకు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. స్థానికంగా ఉన్న భూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ రాజా రమేష్ మోహన్, మండల సర్వేయర్ సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో బ్రాందీషాపు తొలగించాలని వినతి

పెదకాకాని: ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన బ్రాందీషాపు తొలగించాలని నంబూరు గ్రామానికి చెందిన ఎస్.సోమగోపాల్‌రెడ్డి ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పెదకాకాని మండలంలోని నంబూరులోని ప్రధానసెంటర్‌లో సచివాలయం 3,4 నిర్వహిస్తున్నారు. అదే ప్రాతంలో గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారి ఆలయం ఉంది. గ్రామంలో సోమవారం నూతనంగా సచివాలయానికి, గుడికి మధ్యలో ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు వెంబడి వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని సత్తెనపల్లి ప్రధాన రహదారి వెంట ఎన్నో నెలలుగా పడేస్తున్న చెత్తకు మోక్షం కలిగింది. చెత్త గాలికి రహదారిలో ప్రయాణాలు చేసే వారిపై పడుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం 'సాక్షి'లో వచ్చిన ఇదేమి చెత్త పాలన కథనానికి మండల అధికార యంత్రాంగం కదిలింది. ఎట్టకేలకు మండల ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ ఆధ్వర్యంలో చల్లావారిపాలెం గ్రామ కార్యదర్శి ఎన్వీ సత్యనారాయణ పొక్లెయిన్‌తో, ట్రాక్టర్‌లతో మంగళవారం చెత్తను తొలగించారు. ఈఓ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అనేక మార్లు ఇక్కడ నల్లపాడు, ఇతర ప్రదేశాలనుంచి ప్రజలు కొన్ని సంస్థలు తీసుకువచ్చి చెత్తను పడేస్తున్నారని గతంలో చెత్తను పడేయవద్దని చెప్పామని కానీ ఎవ్వరూ లేని సమయంలో చెత్తను అక్కడ పడేస్తున్నారని తెలిపారు. ఈ ప్రదేశంలో చెత్తను పడేస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ట్రాక్టర్ పొక్లెయిన్‌తో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

శివాలయంలో కొబ్బరికాయల వ్యాపారికి నోటీసులు

సాక్షి ఎఫెక్ట్

పెదకాకాని: శివాలయంలో కొబ్బరికాయల వ్యాపారికి నోటీసులు ఇచ్చినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి పూజలకు కుళ్లిపోయిన కొబ్బరికాయలు ఇస్తున్నట్లు ఆలయంలో కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే వ్యాపారి ఫిర్యాదు చేయడం జరిగింది. అలానే మంగళవారం 'సాక్షి'లో శివా శివా ఇదేమి శంకరా నీ పూజకు కుళ్లిపోయిన కొబ్బరికాయలా అనే పేరుతో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన డెప్యూటీ కమిషనర్ మంగళవారం కొబ్బరికాయల వ్యాపారికి నోటీలు జారీ చేశారు. దేవదాయశాఖ నిబంధనల ప్రకారం వివరణ కోరారు. కొబ్బరి చెక్కలు పోగు చేసుకునే హక్కు పొందిన పాటదారుడు బత్తుల భాస్కర్ ఫిర్యాదు మేరకు హరీష్‌కు నోటీసులు ఇవ్వడం జరిగిందని డీసీ తెలిపారు.

ఎక్కడి కుప్పలు అక్కడే..


దుకాణాల ముందు అడ్డుగా ఉన్న మట్టి కుప్పలు

పొన్నూరు: పట్టణ అభివృద్ధిలో భాగంగా ఇటీవల పట్టణంలోని బాపట్ల రోడ్డులో రహదారి విస్తరణకు దుకాణాల వద్ద మున్సిపల్ అధికారులు మట్టి తవ్వకాలు నిర్వహించారు. పది రోజుల నుంచి ఆ మట్టిని తొలగించకుండా వదిలేశారు. దీంతో దుకాణాల ముందు ఎత్తుగా మట్టి కుప్పలు ఉండటంతో వ్యాపారాలు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల్లోకి వచ్చేందుకు కొనుగోలుదారులు మట్టికుప్పలను దాటలేక అవస్థలు పడుతున్నారు.

సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలి

కాకుమాను: మండలంలోని వరి సాగు చేస్తున్న రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలని అప్పుడే పూర్తి స్థాయిలో ఎలుకలను నివారించవచ్చునని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని వరి సాగు చేసే గ్రామాలలోని రైతులకు మంగళవారం ఉచితంగా బ్రోమోడయోలిన్(ఎలుకల నివారణ మందు)ను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాలకు గాను 11 గ్రామాలలోని రైతులు ఈ ఏడాది వరి సాగు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం వరి పంట ఈనిక దశలో ఉన్న నేపథ్యంలో పంటపై ఎలుకల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు.

గుంటూరు రూరల్‌లో..

గుంటూరు రూరల్: వరి పంటను పండించే రైతులకు వారి పంటల్లో ఎలుకలను నివారించి పంటనష్టాన్ని నివారించేందుకు సామూహిక ఎలుకల నివారణపై రైతు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు వట్టిచెరుకూరు వ్యవసాయ శాఖ మండలం అధికారిలక్ష్మి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల రైతులకు ఎలుకల నివారణ మందులను నూరుశాతం సబ్సిడీతో అందించారు. అదేవిధంగా ఎలుకల నివారణ మందులను నూకలు, నూనెతో కలిపి ఏవిధంగా పంటభూమిలో గట్లపై ఏర్పాటు చేసుకోవాలి క్షేత్ర స్థాయిలో వివరించారు.

పెదకాకాని మండలంలో..

పెదకాకాని: రైతులు అందరూ సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా పైరును ఎలుకల బెడద నుంచి కాపాడుకోవచ్చని గుంటూరు భూసార పరీక్ష కేంద్రం అధికారి కె.అన్నపూర్ణ అన్నారు. పెదకాకాని మండలంలోని పెదకాకాని, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో రైతులకు మంగళవారం సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం వరి నూక, నూనె, ఎలుకల మందు బ్రోమోడయోలాన్ మిశ్రమాన్ని రైతులకు అందజేశారు. అనంతరం రైతులతో కలసి పొలం గట్ల వద్ద ఎలుకల నివారణకు మందు పెట్టే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి, గ్రామ సర్పంచి కె.శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణాధికారులు ఆర్.శివాజి, ఎస్.వి.శివరావు, పాల్గొన్నారు.


సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాధికారి అన్నపూర్ణ

రైతులకు విషపు ఎర తయారీపై అవగాహన

పొన్నూరు: మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పలు గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లాం శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మి, రత్న మంజుల పాల్గొని విషపు ఎరను ఎలా తయారుచేయాలో రైతులకు అవగాహన కల్పించారు. బ్రోమోడలిన్ మందు, నూకలు, నూనెతో కలిపి విషపు ఎరను తయారు చేసి చూపించారు. వెల్లలూరులో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదల వెంకటేశ్వరరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి, ఏఓ వెంకట్రామయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



చేబ్రోలు: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్‌ఎం ఏడుకొండలు మంగళవారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు తెనాలిలో నిర్వహించనున్న అండర్- 14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని చెఆప్పరు. 8, 9 తరగతి చదువుతున్న వి.హరీష్, వై.అనిల్, ఎస్కే బషీరు, ఎస్.చార్లెస్ వెస్లీ, ఎస్.జాన్‌వెస్లీ, పి.క్రాంతి, పి.కార్తీక్ ఎంపికయ్యారు. క్రీడాకారులను ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు వ్యాయామ ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, ఎస్.ఉమామహేశ్వరి, శరత్ కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. అమరావతిరోడ్డు నగరాలు వద్ద ఉన్న రిలాక్స్ బార్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని సమాచారం మేరకు అతడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలిచామన్నారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. మృతుని ఆచూకి తెలిసిన వారు 8688831376 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

రావిపాడు(కాకుమాను): సేంద్రీయ ఎరువుల వాడటం వలన రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ బి.సుధారాణి అన్నారు. మండలంలోని రావిపాడు, గోగులమూడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో విపరీతంగా పంట పొలాల్లో రసాయనిక ఎరువులు వాడుతున్నారని దీని వలన దిగుబడులు తగ్గడంతో పాటు పచ్చని పంట పొలాలు సౌడు భూములుగా అయ్యే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టి సేంద్రీయ వ్యవసాయం చేయాలని ఆమె సూచించారు.


ద్రవజీవామృతం ఎరువు తయారీ గురించి రైతులకు వివరిస్తున్న ఏఓ సుధారాణి

నహరే నిగర్ సుల్తానాకు అభినందనలు



తెనాలిఅర్బన్: మెప్మా ఆధ్వర్యంలో విజయనగరంలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో ఎక్కువ అమ్మకాలు జరిపిన స్వయం సహాయక సంఘ సభ్యురాలు తెనాలివాసి సయ్యద్ నహారే నిగర్ సుల్తానాను మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ అభినందించినట్లు తెనాలి సీఎంఎం విజయ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అఖిల భారత సారస్ ఎగ్జిబిషన్‌ను విజయనగరం నిర్వహించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అక్కడ 28 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో 47 స్వయం సహాయ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించినట్లు వివరించారు. తెనాలికి చెందిన సయ్యద్ నహారే నిగర్ సుల్తానా క్రిష్టల్ బ్యాగ్, ఆర్టిఫిషీయల్ జ్యూయలరీ ప్రదర్శనలో ఉంచి విక్రయించడం ద్వారా రూ.2,67,000/-లు లభించిందని చెప్పారు. అత్యాధిక అమ్మకాలు జరిపిన ఆమెను బుధవారం విజయవాడలోని మెప్మా ప్రధాన కార్యాలయంలో మిషన్ డైరెక్టర్ అభినందించారు.

ముగిసిన రెండు రోజుల వర్క్‌షాపు

నెహ్రూనగర్: అర్బన్ ల్యాండ్ రికార్డ్ కోసం సర్వే- రీ సర్వేలో ఆధునిక సాంకేతిక విధానాల అమలుపై సోమ, మంగళవారాల్లో న్యూ ఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ వర్క్ షాప్ విజయవంతం అయినట్లు గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరులు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వర్క్ షాప్‌లో నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్- పట్టణ నివాసాల ఆధారిత భూమి సర్వేలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికైన కుప్పం, మంగళగిరి- తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, ఏలూరు, కాకినాడ, తిరుపతి, అనంతపురం మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లు, రాష్ట్ర డైరెక్టర్ సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీకేష్ బి.లత్కర్ పాల్గొన్నారన్నారు. వర్క్ షాప్‌లో వివిధ దేశాల, రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొని ఆయా ప్రాంతాల్లో పట్టణాల్లో జరుగుతున్న భూ సర్వే, రీ సర్వే విధానాలను కూలంకషంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారన్నారు. ముఖ్యంగా సర్వే విధానంలో అత్యాధునిక డ్రోన్‌లు, జీఐఎస్‌ల సాంకేతికల వినియోగం ద్వారా, రికార్డ్స్ భద్రపరచడం వంటి అంశాలాను ఉదాహరణలతో చర్చించడం జరిగిందన్నారు.


అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

టీచ్ టూల్ అబ్జర్వేషన్ త్వరగా పూర్తి చేయండి

తెనాలిఅర్బన్: టీచ్ టూల్ అబ్జర్వేషన్ త్వరగా పూర్తి చేయాలని ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు సూచించారు. కొత్తపేటలోని మండల విద్యాధికారి కార్యాలయంలో మంగళవారం టీచ్ టూల్, టీపీడీ మ్యాథ్స్ కోర్స్ కోర్సులపై సమీక్ష జరిపారు. గత నెలలో నిర్వహించిన రివ్యూలో సూచించిన విధంగా పలు ప్రభుత్వ పాఠశాలలో అబ్జర్వేషన్ పూర్తి కాకపోవడంపై కొంత అసహనం వ్యక్తం చేశారు. నవంబర్ నాటికి మొత్తం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ తోట వీరయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సూరత్‌కు అంబేడ్కర్ కాంస్య విగ్రహాలు



తెనాలి: పట్టణ శిల్పకళకు జాతీయ స్థాయి గుర్తింపును తీసుకొచ్చిన స్థానిక సూర్య శిల్పశాల, కాటూరి ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు రవిచంద్ర తాజాగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఫైబర్‌గ్లాస్, కాంస్య విగ్రహాలను రూపొందించారు. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ పట్టణంలో ప్రతిష్ట నిమిత్తం తయారుచేసిన ఈ విగ్రహాలను మంగళవారం ప్రత్యేక వాహనంలో అక్కడకు తరలించారు. గతంలో కుర్చీలో కూర్చున్నట్టు రూపొందించిన అంబేడ్కర్ విగ్రహాన్ని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు పంపగా, వచ్చిన ఆదరణతో ఇప్పుడు సూరత్ నుంచి ఆర్డరు వచ్చినట్టు కాటూరి తెలియజేశారు. ఏడున్నర అడుగుల ఫైబర్‌గ్లాస్ విగ్రహంతోపాటు నాలుగున్నర అడుగుల ఎత్తులో రెండు కాంస్య విగ్రహాలకు 1300 కిలోల కాంస్యాన్ని వినియోగించి, తయారీకి మూడు నెలల సమయం పట్టినట్టు వివరించారు.